

## చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు, కనిష్టం రూ.8 వేలు విక్రయాలు జరిగాయి.



## టమాట కిలో రూ.21

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.21, కనిష్టం రూ.12, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.1°/21.3°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### వైద్య కళాశాలకు మరో 15 పీజీ సీట్లు



**అనంతపురం కార్పొరేషన్:** అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలకు మరో 15 పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకే పీజీ సీట్లు ఉన్న అనస్తీషియాకు 4, అబ్‌స్ట్రిక్స్, గైనకాలజీ 4, పీడియాట్రిక్స్ విభాగానికి 4 పీజీ సీట్లు మంజూరయ్యాయి. అలాగే కొత్తగా హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి 3 పీజీ సీట్లు వచ్చాయి.

### ప్రతి విద్యార్థీ కౌశల్ క్విజ్‌లో పాల్గొనాలి


**అనంతపురం సిటీ:** జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే కౌశల్ క్విజ్‌లో విద్యార్థులందరూ పాల్గొనేలా చూడాలని జిల్లా విద్యా శాఖాధికారి ప్రసాద్‌బాబు ఆదేశించారు. కౌశల్ క్విజ్–2025కు సంబంధించి రూపొందించిన పోస్టర్లను అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. శనివారం నిర్వహించనున్న పాఠశాల కాంప్లెక్స్ సమావేశాల్లో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో కౌశల్ క్విజ్‌లో పాల్గొనే విద్యార్థుల పేర్లను నమోదు చేయాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ, కౌశల్ జిల్లా సమన్వయకర్త ఆనంద భాస్కర్‌రెడ్డి, డీఈఓ కార్యాలయ ఏడీ శ్రీనివాసులు, ఏఎస్ఓ శ్రీనివాసులు, ఎస్టీయూ ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

### అక్రమంగా టపాసులు విక్రయిస్తే చర్యలు



**అనంతపురం సెంట్రల్:** జిల్లాలో అక్రమంగా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లైసెన్స్ కలిగిన దుకాణాదారులు మాత్రమే టపాసులు విక్రయించాలని స్పష్టం చేశారు. అనధికారికంగా ఎవ్వరైనా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తాత్కాలిక లైసెన్స్‌దారులు జిల్లా యంత్రాంగం సూచించిన ప్రదేశాల్లో మాత్రమే నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరు, ఇసుక, ఇతర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను విక్రయ పనుల్లో ఉంచుకోరాదని తెలిపారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకొని దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు కాల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సరదాకు కూడా చేతిలో పట్టుకొని కాల్చకూడదని, అగ్నిప్రమాదం సంభవించే ప్రదేశాల్లో టపాసులు ఉంచరాదని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా ప్రమాదాలు జరిగినా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్ 100, 112కు సమాచారం అందించాలని కోరారు.

### అత్యాచారం కేసులో పదేళ్ల జైలు



**ఆత్మకూరు:** వృద్ధురాలిపై అత్యాచారం చేసిన కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ అనంతపురం నాల్గవ సెషన్స్ కోర్టు జడ్జి తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆత్మకూరు ఎస్ఐ లక్ష్మణరావు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. మదిగుబ్బ గ్రామానికి చెందిన పెద్దన్న అనే వ్యక్తి 2018లో మండల పరిధిలోని ఒక గ్రామంలో ఇంటి ముందు నిద్రిస్తున్న వృద్ధురాలిపై అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 15 మంది సాక్షులను విచారించిన అనంతరం ముద్దాయి పెద్దన్నపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ అనంతపురం నాల్గవ సెషన్స్ కోర్టు జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు.

# జులుంపై గర్జించిన కలం



**మీడియా స్వేచ్ఛను హరిస్తోన్న సర్కార్**

- భావ ప్రకటనా స్వేచ్ఛకు తూట్లు
- వార్తలు రాస్తే కేసులు పెట్టడమేంటి?
- సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తేయాలని డిమాండ్
- జిల్లా అంతటా ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి జర్నలిస్టుల ఆందోళన



అనంతపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు



అక్రమ కేసులు ఎత్తివేయాలని అందజేసిన వినతి పత్రాన్ని స్వీకరిస్తున్న డీఎస్పీ వి.శ్రీనివాసరావు

**అనంతపురం:** మీడియాపై కూటమి సర్కారు పోలీసులను అడ్డుపెట్టుకుని చేస్తున్న జులుంపై కలం గర్జించింది. మీడియా స్వేచ్ఛను హరించేవిధంగా వేధింపులకు పాల్పడుతున్న తీరును ఎండగట్టింది. ప్రజల గొంతుకై నిలుస్తున్న 'సాక్షి'పై సర్కారు సాగిస్తున్న దమనకాండను నిరసించింది. నకిలీ మద్యం వల్ల కలుగుతున్న దుష్పరిణామాలు, ప్రాణాలు కోల్పోతున్న అమాయకుల గురించి వాస్తవాలను ప్రచురించినందుకు ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని పెద్దపెట్టున నినదించింది. ఒకే కేసుకు సంబంధించి విడతల వారీగా వచ్చి నోటీసులు జారీ చేయడం, సమాధానాలు ఇచ్చి, విచారణకు సహకరించినా ఎడిటర్‌ను టార్గెట్ చేస్తూ వేధించడాన్ని తప్పు పట్టింది. నిజాల్ని నిర్భయంగా ప్రపంచానికి చూపే అక్షరానిదే అంతిమ విజయమని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా అంతటా జర్నలిస్టులు ఆందోళనలకు దిగారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థి, యువజన తదితర ప్రజాసంఘాలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు జర్నలిస్టుల ఆందోళనలకు సంఘీభావం ప్రకటించారు. ప్రజాస్వామ్యానికి నాలుగు మూలస్తంభాల్లో ఒక్కటైన మీడియాపై జరుగుతున్న దాడిని ముక్తకంఠంతో ఖండించారు. అనంతపురంలో జిల్లాపరిషత్ ఎదురుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట చేపట్టిన నిరసనలో 'మీడియాపై దాడి సిగ్గు సిగ్గు.. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి.. పోలీసుల జులుం నశించాలి.. సర్కారు కక్ష సాధింపు చర్యలు ఆపాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సాక్షి టీవీ కరస్పాండెంట్ శివారెడ్డి, సాక్షి ఎడిషన్ ఇన్‌చార్జ్ తోలేటి మహేశ్వరరెడ్డి, జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అనిల్‌కుమార్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, వైఎస్సార్‌టీవీ సాయినాథ్ రెడ్డి, జైభీమ్ రావు భారత్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు నరేష్ కొడవళ్ల, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు, తెలుగు వెలుగు వ్యవస్థాపకులు టీవీ రెడ్డి, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు, ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ రాజు, ఏపీ ఎమ్మార్పీఎస్ యువసేన జిల్లా అధ్యక్షుడు లబ్బె రాఘవ, సమాచార హక్కు పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్, బేడ బుడగ జంగం జిల్లా అధ్యక్షుడు అంజి, జేఏసీ నాయకులు రామకృష్ణ, ఇర్ఫాన్, నారాయణస్వామి, రామాంజినేయులు కూటమి ప్రభుత్వం తీరును ఖండించారు. కార్యక్రమంలో సాక్షి సర్క్యులేషన్ ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీవీటీ ఇన్‌చార్జ్ రెడ్డప్పరెడ్డి, జర్నలిస్టులు, రిటైర్డ్ హెచ్ఎం పండిట్ రియాజుద్దీన్ అహ్మద్, ద్విభాషా కవి డాక్టర్ జూటూరు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. ఇక రాయదుర్గం, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాప్తాడు, గుంతకల్లు నియోజకవర్గాల్లోనూ జర్నలిస్టులు ఆందోళనలు నిర్వహించి పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, అక్రమ కేసులు ఎత్తేయాలని ఆర్డీఓలు, తదితర అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

### పత్రికా స్వేచ్ఛను హరించొద్దు



ప్రజలకు వాస్తవాలు తెలియజేయడం మీడియా కర్తవ్యం. అలా చేయడమే నేరమని ప్రభుత్వం భావించడం సమంజసం కాదు. పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు. ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా ఉండాలి. 'సాక్షి' గొంతు నొక్కే చర్యను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి.

–టీవీ రెడ్డి, తెలుగు సాహిత్య వేదిక

### అప్రజాస్వామిక చర్య



పత్రిక ఎడిటర్‌పై వేధింపులకు పాల్పడటం చరిత్రలో ఇదే తొలిసారి. ఇటీవలి కాలంలో విలేకరులపై దాడులు నిత్యకృత్యమయ్యాయి. సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి నోటీసులు జారీ చేయడం అప్రజాస్వామిక చర్య.

– కె.అనిల్‌కుమార్‌రెడ్డి, జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

### సంఘటితంగా పోరాడాలి



నకిలీ మద్యానికి సంబంధించి సాక్షిలో ప్రచురితమైన వార్తలకు సంబంధించి ఎడిటర్ ధనంజయరెడ్డికి పోలీసులు ఏకపక్షంగా నోటీసులు ఇచ్చి అవమానపరిచారు. పత్రికా సంపాదకులను ఇలా ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం?

– సాకే హరి, ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

### బెదిరింపు ధోరణి సరికాదు



పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. సాక్షి కార్యాలయాలపై దాడులు, ఎడిటర్‌పై కేసులు అనైతికం. వార్తలతో మనోభావాలు దెబ్బతిన్నాయని భావిస్తే కౌంటర్ వివరణ ఇవ్వాలి. అంతేగానీ ఇలా బెదిరింపు ధోరణితో వ్యవహరించడం సరికాదు. గతంలో ఇలాంటి సంస్కృతి లేదు.

– కేపీ రాజు, ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు

### పత్రికా స్వేచ్ఛను హరించడమే



పత్రికల్లో వార్త ప్రచురిస్తే.. సదరు 'న్యూస్ సోర్స్' వెల్లడించాలని పోలీసులు బలవంతం చేయకూడదు. 'సాక్షి' ఎడిటర్ ధనంజయ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వరుసగా కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే.

– సుగమంచి శ్రీనివాసులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు

### కక్ష సాధింపు ధోరణి తగదు



కూటమి ప్రభుత్వం 'సాక్షి' పత్రికపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి. పత్రికా స్వేచ్ఛను హరించే రీతిలో సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామికం. సాక్షి విలేకరులపై పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేయాలి.

– లబ్బే రాఘవ, ఏపీ ఎమ్మార్పీఎస్ యువసేన జిల్లా అధ్యక్షుడు

### ఆత్మస్థైర్యం దెబ్బతీయలేరు



పోలీసులు పదేపదే జారీ చేసే నోటీసులతో సాక్షి మీడియా ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, జర్నలిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. ఐదు రోజుల వ్యవధిలో ఒకే కేసుకు నాలుగైదు నోటీసులు జారీ చేయడం ప్రజాస్వామ్య చరిత్రలో ఇదే తొలిసారి.

–నరేష్ కొడవళ్ల, జైభీమ్‌రావు భారత్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు

### మీడియా స్వేచ్ఛను కాపాడాలి



ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను కాపాడాలి. సాక్షిపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తేయాలి. జర్నలిస్టులను, మీడియా సంస్థలను ఇబ్బంది పెట్టే విధానం మానుకోవాలి. జర్నలిస్టుల గళాన్ని అణచే చర్యలను తక్షణం ఆపాలి.

–రామిరెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి

### వార్తలు రాస్తే కేసులు పెడ్తారా?



పత్రికల్లో వార్తలు రాశారని కేసులు నమోదు చేయడం పాత్రికేయుల నైతిక బలాన్ని హరించడమే. సాక్షి ఎడిటర్‌కు నోటీసులు ఇవ్వడం తగదు. పోలీస్ శాఖ అనైతిక చర్యలకు దిగడం ఎంతమాత్రమూ కరెక్టు కాదు.

– కుంటిమద్ది ఓబులేసు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

# ఎత్తిపోతల పథకంలో సాంకేతిక సమస్య

- ఒక్కసారిగా ఆగిపోయిన మోటర్లు
- మరమ్మతుల అనంతరం మళ్లీ నీటి పంపింగ్



మోటర్లను పరిశీలిస్తున్న హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ నాగరాజు, ఎస్ఈ రాజ్‌స్వరూప్

**వజ్రకరూరు:** రాగులపాడు సమీపంలోని హంద్రీ–నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ఎత్తిపోతల పథకంలో శుక్రవారం తెల్లవారుజామున సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో నీటిని ఎత్తిపోస్తున్న తొమ్మిది మోటర్లు ఒక్కసారిగా ఆగిపోయాయి. రాగులపాడు లిఫ్ట్‌కు 2,800 క్యూసెక్కుల మేర నీరు వస్తోంది. అయితే కొన్ని గంటలకే కాలువలో నీటి మట్టం పెరిగిపోయింది. అప్రమత్తమైన లిఫ్ట్ సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ నాగరాజు, ఎస్ఈ రాజ్‌స్వరూప్, ఈఈ శ్రీనివాస్‌నాయక్, డీఈ వెంకటరమణ, జేఈ సురేష్‌నాయక్ తదితరులతో పాటు మరికొందరు అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని మోటర్లను పరిశీలించారు. కాలువలో నీటి మట్టం పెరగడంతో అధికారులు ఛాయాపురం వద్దకు చేరుకుని ఎస్కేప్ చానల్ వద్ద జేసీబీతో నీటిని మళ్లించారు. అనంతరం నాలుగు పంపుల ద్వారా నీటి పంపింగ్ ప్రారంభించారు. ఇంజినీరింగ్ అధికారుల బృందం రాగులపాడు ఎత్తిపోతల పథకం వద్దకు చేరుకుని మరమ్మతులు ప్రారంభించింది. మధ్యాహ్నం నుంచి తిరిగి తొమ్మిది పంపుల ద్వార నీటి పంపింగ్ ప్రారంభించినట్లు వెల్లడించారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు, వజ్రకరూరు తహసీల్దార్ నరేష్ కుమార్, ఉరవకొండ సీఐ మహానంది తదితరులు అక్కడకు చేరుకుని పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా ఛాయాపు రం వద్ద ఎస్కేప్ ఛానల్ నుంచి కృష్ణా జలాలు పెద్ద ఎత్తున ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

## శిశుగృహ ఘటనలో ఎనిమిది మందికి షోకాజ్

**అనంతపురం రూరల్:** శిశుగృహలో జరిగిన రెండు నెలల పసికందు ఆకలి చావు ఘటనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులైన ఎనిమిది మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఐసీడీఎస్ పీడీ నాగమణిని ఇప్పటికే సస్పెండ్ చేసిన ప్రభుత్వం 'మిషన్ శక్తి – మిషన్ వాత్సల్య' జిల్లా మేనేజర్ అయిన ఉరవకొండ సీడీపీఓ డాక్టర్ బీఎన్ శ్రీదేవికి చార్జ్‌మెమో ఇచ్చిన విషయం విదితమే. ఇక ప్రధాన కారకులుగా భావిస్తున్న శిశుగృహ మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం గుణవతికి తాజాగా షోకాజ్ నోటీసులను పీడీ కార్యాలయ అధికారులు శుక్రవారం అందించారు. ఒక్కొక్కరినీ కార్యాలయానికి పిలిపించి నోటీసులు అందించి, సంతకాలు చేయించుకున్నారు. వారితో పాటు ఆయాలు నూర్జహాన్, ఆదిలక్ష్మి, పద్మావతి సహా నైట్ వాచ్‌మెన్ రాజశేఖర్‌కు షోకాజ్ నోటీసులు అందించారు. ఈ నెల 2న ఘటన జరగ్గా.. 17వ తేదీ వరకు ఇంకా నోటీసులు జారీకే పరిమితి కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనలో కొందరిని కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## నేడు ఇంజినీరింగ్ స్పాట్ అడ్మిషన్లు

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో భర్తీ కాకుండా మిగిలిన సీట్లకు శనివారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. సీటు దక్కిన విద్యార్థులు తక్షణమే మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు ఈ కోటాలో భర్తీ అయ్యే సీట్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల్లోపు కౌన్సెలింగ్‌లో రిపోర్ట్ చేసుకోవాలన్నారు.

# ఐఎస్ఐతో సంబంధాలు ఉన్న ఇద్దరి అరెస్ట్

- సింగిల్ బారెల్ రైఫిల్, సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్ కుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

**పుట్టపర్తి టౌన్:** పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సాజాద్ హుస్సేన్, మహారాష్ట్రకు చెందిన తౌఫీక్ ఆలమ్ షేక్‌ను శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. ధర్మవరం పట్టణానికి చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్ పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థలతో వాట్సాప్, ఫోన్‌కాల్స్ ద్వారా సంబంధాలు నెరపడంతో అతన్ని ఈ ఏడాది ఆగస్టు 16న పోలీసులు అరెస్ట్ చేశారు. అతన్ని కస్టడీలోకి తీసుకుని విచారించగా..ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సాజాద్ హుస్సేన్, మహారాష్ట్రకు చెందిన తౌఫీక్ ఆలమ్ షేక్ పాత్ర తేలింది. దీంతో ప్రత్యేక పోలీసు బృందం ఈ నెల 13న ఉత్తరప్రదేశ్ పోలీసుల సహకారంతో ఆ రాష్ట్రంలోని అమ్రోహాలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సాజాద్ హుస్సేన్‌ను అరెస్ట్ చేసింది. అతని నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలు, జిహాద్ మెటీరియల్ స్వాధీనం చేసుకుంది. అదే రోజు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ఏటీఎస్ బృందాలు దాడులు నిర్వహించి..మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలో మాలేగావ్‌లో తౌఫీక్ ఆలమ్‌షేక్‌ను అదుపులోకి తీసుకున్నాయి. అతని నుంచి సింగిల్ బారెల్ రైఫిల్, సెల్‌ఫోన్లు, జిహాద్ మెటీరియల్ స్వాధీనం చేసుకున్నాయి. వీరిద్దరూ పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ ఆధారిత వాట్సాప్ గ్రూప్‌లు, చానల్స్‌లో కూడా క్రియాశీలక సభ్యులుగా ఉన్నారు. వీరు యువతను జిహాదీ వైపు మళ్లించడంతో పాటు పాకిస్థాన్‌లో మిలటరీ శిక్షణ తీసుకుని భారతదేశంపై యుద్ధం చేయాలని యోచిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అరెస్ట్ చేసిన ఇద్దరినీ పుట్టపర్తి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

**పీఎఫ్ఐ ప్రతినిధుల జిహాదీ కార్యకలాపాలు**

దేశంలో నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) ప్రతినిధులు ఇతర నిషేధిత సంస్థలతో సంబంధాలు పెట్టుకుని సామాజిక సేవ పేరుతో జిహాదీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ముస్లిం యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. పాక్ ఆధారిత సోషల్ మీడియా గ్రూపులపై గట్టి నిఘా ఉంచామన్నారు. యువత సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా సందేహాస్పద కార్యకలాపాలు, దేశ వ్యతిరేక, రాడికల్ భావాలను ప్రోత్సహించే వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. నిందితుల అరెస్టుకు శ్రమించిన ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో పాటు ఎస్‌బీ సీఐ వెంకటేశ్వర్లు, ముదిగుబ్బ సీఐ శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

## 22 నుంచి 'సదరం'

**అనంతపురం టౌన్:** ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా వాయిదా పడిన సదరం క్యాంపులను ఈ నెల 22 నుంచి నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శైలజ తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధ, గురు, శుక్రవారాల్లో సదరం క్యాంపులు అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ఏరియా ఆస్పత్రుల్లో ఉంటాయని పేర్కొన్నారు.

## మత్స్యకార సొసైటీ సభ్యులకు అవగాహన

**అనంతపురం అగ్రికల్చర్:** అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఫిషరీస్ కార్యాలయంలో మత్స్యకార సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు నగేష్ అధ్యక్షతన సొసైటీల నిర్వహణ, ఆర్థిక పరిపుష్టి, సభ్యత్వం, ఆడిటింగ్ తదితర అంశాలపై మత్స్యకార సొసైటీల అధ్యక్షులు, సభ్యులకు అవగాహన కల్పించారు. ఫిషరీస్ డీడీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు హాజరై సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో ఎఫ్‌డీవోలు ఆసిఫ్, లక్ష్మీనారాయణ, బాబునాయక్, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

# టపాసులతో భద్రం

## అప్రమత్తంగా లేకపోతే ప్రమాదమేనంటున్న అధికారులు



**అనంతపురం కల్చరల్/సెంట్రల్:** ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వారి కోసమన్నట్లు నరక చతుర్దశి, దీపావళి పర్వదినాలు ఆది, సోమవారాల్లో వచ్చేస్తున్నాయి. మరో రెండు రోజులుండగానే ఉమ్మడి జిల్లాలో పండుగ వాతావరణం సందడి చేస్తోంది. దీపావళి అంటే ముందుగా గుర్తుకొచ్చేది టపాసుల మోతనే. పల్లెలయినా, పట్టణాలయినా దీపావళి నాడు టపాసుల మోతతో దద్దరిల్లాల్సిందే. అయితే బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు, అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- కొనుగోలు చేసిన బాణాసంచాను ఎట్టి పరిస్థితుల్లో వంట గదిలోనో, పొయ్యి ఉన్న ప్రాంతంలోనో ఉంచకూడదు. సురక్షిత ప్రదేశంలోనే పెట్టాలి.
- పటాసులను చేతిలో పట్టుకుని కాల్చరాదు.
- టపాసులను వెలిగించిన తర్వాత పేలకపోతే వాటిపై వంగి చూడడం ప్రమాదం.
- తారాజువ్వలను సీసా, బోర్లించిన రేకు డబ్బాలో పెట్టి కాల్చే పద్ధతి కూడా ప్రమాదమే.
- టపాసులు కాల్చే సమయంలో సింథటిక్ దుస్తులు కాకుండా నూలు దుస్తులు ధరించాలి
- గాలులు విపరీతంగా ఉన్న చోట కాసేపు ఆగి టపాసులు కాల్చాలి. లేదంటే నిప్పు రవ్వలు కళ్లను దెబ్బతీసే ప్రమాదముంటుంది.
- బాణాసంచా కాల్చే సమయంలో దగ్గరగా నీటిని, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలి.
- చిన్న పిల్లలు టపాసులు కాల్చే సమయంలో ఒంటరిగా కాకుండా తల్లిదండ్రులు పక్కన ఉండాలి.
- ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో బాణాసంచా వల్ల గాయపడితే సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించాలి. కాలిన చోట రుద్దడం వల్ల చర్మం పాడవుతుంది. ఆస్పత్రికి వెళ్లే వరకూ తడిగుడ్డతో కప్పి ఉంచాలి.
- ఇంటి బయట మాత్రమే టపాసులు కాల్చాలి. ఇళ్లలో ప్రమాదకర వస్తువులున్నప్పుడు వాటి తీవ్రత మరింత అధికమవుతుంది.
- విపరీతమైన శబ్దాలను చెవులు భరించలేవు. చెవుల్లో దూది పెట్టుకుంటే రక్షణగా ఉంటుంది.
- అన్ని జాగ్రత్తలు పాటిస్తూనే కళ్లకు, చెవులకు, చర్మానికి ప్రమాదంలేని, పెద్ద మోత చేసే టపాసుల కన్నా తారాజువ్వలు, చిచ్చుబుడ్లు, కాకరొత్తులు, పెన్సిళ్లు, భూచక్రాల వంటి వాటితో ఆనందంగా దీపావళి జరుపుకోవడం ఉత్తమం.

జాగ్రత్తలు పాటించాలి



“ టపాసులు కాల్చే సమయంలో ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా ఆరుబయటే టపాసులు కాల్చాలి. ఇరుకు ప్రదేశాల్లో కాలిస్తే ప్రమాదం బారిన పడే అవకాశముంది. కాటన్ దుస్తులు ధరించాలి. టపాసులు విక్రయదారులు కూడా జాగ్రత్తలు పాటించాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. దుకాణాలకు మధ్య దూరం ఉండాలని, డ్రమ్ముల్లో నీళ్లు, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని సూచించాం.

–కే.పీ లింగమయ్య, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్, జిల్లా అగ్నిమాపకశాఖ

## క్లుప్తంగా

### వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- పాత్రికేయులకు ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సూచన



మాట్లాడుతున్న ఆలపాటి సురేష్‌కుమార్

**రాయదుర్గంటౌన్:** మారుతున్న కాలానికి అనుగుణంగా పాత్రికేయులు కూడా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పాత్రికేయులకు ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ సూచించారు. రాయదుర్గంలోని కణేకల్లు రోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు సాగే జర్నలిస్టుల శిక్షణ తరగతులను ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా యూనియన్ నాయకులు భోగేశ్వరరెడ్డి తదితరులతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఏఐ టెక్నాలజీ అన్ని రంగాల్లో విస్తరిస్తోందని, దీనిపై కూడా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, మహమ్మద్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

### వీఏఏకు షోకాజ్

**అనంతపురం అగ్రికల్చర్:** ఆర్‌ఎస్‌కే వేదికగా రైతులకు విక్రయించిన ఎరువులకు సంబంధించి మార్క్‌ఫెడ్‌కు కట్టాల్సిన సొమ్ము వెంటనే చెల్లించాలని కూడేరు–2 విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ) కె.నరేష్‌కుమార్‌కు జేడీఏ ఉమామహేశ్వరమ్మ షోకాజ్ నోటీసు జారీ చేశారు. గార్లదిన్నె మండలం మర్తాడు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సమయంలో ఎరువుల సొమ్ము రూ.1,08,478 చెల్లించకుండా సొంతానికి వాడుకున్నట్లుగా నిర్ధారణ అయింది. ప్రస్తుతం కూడేరుకు బదిలీ అయిన నేపథ్యంలో పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. శనివారం సాయంత్రం 5 గంటల్లోపు మార్క్‌ఫెడ్‌కు సొమ్ము జమ చేయకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### వలస కార్మికుల మృతి

**రాయదుర్గం టౌన్:** బెంగళూరులో చోటు చేసుకున్న ప్రమాదంలో రాయదుర్గానికి చెందిన వలస కార్మికుడు మృతి చెందాడు. వివరాలు... స్థానిక అంబేడ్కర్ నగర్ ఫస్ట్ క్రాస్‌లో నివాసముంటున్న నాగరాజు (37)కు భార్య గాయత్రి, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. బెంగళూరుకు వలస వెళ్లి అక్కడే బేల్దారి మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి నెలమంగల ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేశారు.

- **తాడిపత్రి టౌన్:** మండలంలోని అయ్యవారిపల్లి సమీపంలో ఉన్న సుగుణ స్పాంజ్ ఐరన్ పరిశ్రమలో పనిచేస్తున్న వలస కార్మికుడు పురుషోత్తం నిషాద్ (31) మృతి చెందాడు. యూపీకి చెందిన పురుషోత్తం నిషాద్ గురువారం రాత్రి తాడిపత్రి మండలం బుగ్గ వద్దకెళ్లి మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. మత్తులో వాహనాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డాడు. అటుగా వెళుతున్న వారు గమనించి క్షతగాత్రుడిని తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం తనకు ఫ్యాక్టరీ యాజమాన్యం కేటాయించిన గదికి వెళ్లిన పురుషోత్తం నిషాద్. శుక్రవారం ఉదయం అల్పాహారం చేసిన తర్వాత తీవ్ర అస్వస్థతకులోనై మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### ఉపాధి కూలీలకు ఈ-కేవైసీ తప్పనిసరి



కుందుర్పిలో ఈ-కేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

**కుందుర్పి/బెళుగుప్ప:** ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలకు ఆన్‌లైన్ ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతాలకు బిల్లులు జమ అవుతాయని, ఇందుకు ప్రతి కూలీ ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. కుందుర్పి మండలం మలయనూరు, నిజవళ్లి, కుందుర్పి, బెళుగుప్ప మండల కేంద్రంలో ఉపాధి సిబ్బంది శుక్రవారం చేపట్టిన ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను శుక్రవారం ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. ఇకపై కూలి పనికి వెళ్లిన కూలీలకు మాత్రమే బిల్లులు చెల్లింపులు ఉంటాయన్నారు. లోకేషన్ ఆధారంగా పనుల్లో పాల్గొనే కూలీలను రెండు సార్లు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. బిల్లులు చెల్లింపులో ఇకపై ఎలాంటి అవకతవకలకు అస్కారముండదని పేర్కొన్నారు. గడువులోపు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కుందుర్పి ఎంపీడీఓ మాధవి, ఏపీఓ మురళీధర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్‌ఆర్‌ఐటీకి జాతీయ స్థాయి పురస్కారాలు



పురస్కారాన్ని అందుకుంటున్న ఎస్‌ఆర్‌ఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి

**బుక్కరాయసముద్రం:** మండల పరిధిలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయి పురస్కారాలు దక్కాయి. ఈ మేరకు ఆ కళాశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ శుక్రవారం వెల్లడించారు. ఏఐసీటీఈ-ఎడుస్కిల్స్ సంయుక్తంగా ఇటీవల దేశ వ్యాప్తంగా ఉన్న అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలల వర్చువల్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన కళాశాలల్లో ఎస్‌ఆర్‌ఐటీ మూడో స్థానంలో నిలిచింది. ఈ ఘనతకు గుర్తింపుగా సిమ్లాలో ఎడుస్కిల్స్ కనెక్ట్’25 నిర్వహించిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పురస్కారాలను ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్ రెడ్డి అందుకున్నారు. బెస్ట్ ఫర్మార్మింగ్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ అవార్డు, టాలెంట్ కనెక్ట్ ఎక్స్‌లెంట్ అవార్డు, ఫైవ్ ఇయర్స్ పార్ట్నర్ షిప్ అవార్డులు లభించినట్లు రంజిత్‌రెడ్డి తెలిపారు. అలాగే జెడ్‌స్కాలర్ ఇంటర్న్‌షిప్ డొమైన్, జూనియర్ ఇంటర్న్‌షిప్ డొమైన్, సెల్‌కోన్ ఇంటర్న్‌షిప్ డొమైన్, ఎడుస్కిల్స్ అకాడమీ ఇంటర్న్‌షిప్ డొమైన్ విభాగాలలో కూడా ఎస్‌ఆర్‌ఐటీలోని సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలకు ఉత్తమ అవార్డులు దక్కాయన్నారు. బోధనా విభాగంలోనూ ఎస్‌ఆర్‌ఐటీ ప్రతిభ చాటుకుందన్నారు. డాక్టర్ సాయి చైతన్య కిషోర్‌కు డైరెక్టర్ ఎక్స్‌లెన్స్ అవార్డు, డాక్టర్ రంజిత్‌రెడ్డి, వరుణ్‌కుమార్‌కు డెటికేటెడ్ సీఓఈ ఎడుకేటర్ అవార్డు, డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్‌కు బెస్ట్ ఫర్మార్మింగ్ సీఓఈ కోఆర్డినేటర్ అవార్డులు దక్కాయన్నారు. కళాశాల కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు జాతీయ స్థాయిలో ర్యాంకులు, అవార్డులు సాధించడం చాలా గర్వంగా ఉందని పేర్కొన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడంలో అధ్యాపకులు చేసిన కృషి అభినందనీయం అన్నారు.

# అదరగొట్టిన రాహుల్, అభినవ్



151 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన రాహుల్



101 పరుగులు చేసిన అభినవ్

**అనంతపురం కార్పొరేషన్:** అనంతపురం స్పోర్ట్స్ సెంటర్‌లో బీసీసీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న సీకే నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. ఆంధ్ర బ్యాటర్లు ఎస్వీ రాహుల్, అభినవ్ చెలరేగి సూపర్ సెంచరీలతో రాణించారు. ఫలితంగా ఆటముగిసే సమయానికి ఆంధ్ర జట్టు 4 వికెట్లు కోల్పోయి 470 పరుగులు సాధించింది. గురువారం కురిసిన వర్షం కారణంగా శుక్రవారం రెండో రోజు మ్యాచ్ రెండు గంటల ఆలస్యంగా ప్రారంభమైంది. ఓవర్‌నైట్ స్కోర్ 210/2తో బరిలో దిగిన ఆంధ్ర బ్యాటర్ తేజ ఆట ప్రారంభమైన కాసేపటికి పెవిలియన్ ముఖం పట్టాడు. ఈ దశలో జత కట్టిన ఎస్వీ రాహుల్, అభినవ్.. ఢిల్లీ బౌలర్లను ఓ ఆట ఆడుకున్నారు. నిలకడగా ఆడుతూ.. అవకాశం దొరికినప్పుడల్లా బంతిని బౌండరీలు దాటిస్తూ భారీ స్కోర్‌కు బాటలు వేశారు. ఎస్వీ రాహుల్ 292 బంతులను ఎదుర్కొని 15 ఫోర్లు,2 భారీ సిక్సర్లతో 151 పరుగులు చేసి, క్రీజ్‌లో కొనసాగుతున్నాడు. అభినవ్ 190 బంతుల్లో 101 పరుగులు చేసి అవుటయ్యాడు. ఢిల్లీ బౌలర్లలో యుగల్ షైనీ 2/37, మన్నన్, దేవ్‌లక్ర చెరో వికెట్ తీసుకున్నారు.

# ‘శుభప్రదమ్’ ఆరంభం

- తారలు దిగిరావడంతో సందడిగా మారిన గుంతకల్లు
- ఏపీలోనే మొట్టమొదటి షోరూం



శుభప్రదమ్ షోరూంను ప్రారంభిస్తున్న సినీతారలు ఐశ్వర్యరాజేష్, రితికానాయక్

**గుంతకల్లు:** ‘సంక్రాంతికి వస్తున్నాం’ ఫేమ్ ఐశ్వర్యరాజేష్, ‘మిరాయ్’ హీరోయిన్ రితికానాయక్ శుక్రవారం గుంతకల్లులో సందడి చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటైన ‘శుభప్రదమ్’ మెగా షాపింగ్ మాల్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవానితో కలసి షోరూమ్ మొత్తం కలియతిరిగారు. ఫొటోలకు ఫోజులిస్తూ సెల్ఫీలతో ఉత్సాహ పరుస్తూ అభిమానుల్లో జోష్ నింపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏపీలోనే మొట్టమొదటి శుభప్రదమ్ మెగా షోరూంను తమ చేతుల మీదుగా, అందులోను గుంతకల్లులో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. శుభకార్యాలకు దుస్తుల కోసం హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సరసమైన ధరకే శుభప్రదమ్ షాపింగ్ మాల్‌లో ఎంతో నాణ్యమైన దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. కొనుగోళ్లపై చక్కటి ఆఫర్లను నిర్వాహకులు అందజేస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం షోరూమ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై ఇద్దరు హీరోయిన్లు పలు పాటలకు స్టెప్పులు వేసి అభిమానులను అలరించారు. కార్యక్రమంలో శుభప్రదమ్ షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.సత్యనారాయణ, పట్టణ ప్రముఖులు పసుపుల హరినాథ్, మంజు. ఓంకార్, పత్రాల సురేష్, రంగ తదితరులు పాల్గొన్నారు.

### డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

**అనంతపురం అర్బన్:** తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ గురువారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 37 మంది తహసీల్దార్లకు పదోన్నతి కల్పించగా ఇందులో జిల్లాకు చెందిన ఇద్దరు ఉన్నారు. పదోన్నతి పొందిన వారిలో ఉరవకొండ తహసీల్దారుగా ఉంటూ కూడేరు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న ఎస్‌కే మహబూబ్‌బాషా, రాయదుర్గం తహసీల్దారు జి.నాగరాజు ఉన్నారు. పోస్టింగ్ ఇచ్చేంత వరకూ వారు ప్రస్తుత స్థానాల్లోనే కొనసాగనున్నట్లు సమాచారం.

### వృద్ధాశ్రమం కోసం జోలె పట్టిన రామ్‌లక్ష్మణ్



నార్పలలో చందాలు వసూలు చేస్తున్న ఫైట్ మాస్టర్లు

**శింగనమల(నార్పల):** వృద్ధాశ్రమానికి తమ వంతు సాయంగా జోలె పట్టి చందాలు సేకరించారు ఫైట్ మాస్టర్లు రామ్, లక్ష్మణ్. వివరాలు.. నార్పల మండలం కురగానిపల్లిలో చంద్రశేఖర్ రెడ్డి, స్రవంతి దంపతులు చెన్నకేశవ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. వారి నిస్వార్థ సేవలను గుర్తించిన రామ్, లక్ష్మణ్ శుక్రవారం నేరుగా కురగానిపల్లిలోని వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వృద్ధులతో మాట్లాడారు. వారి సాధక బాధలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నార్పలలో జోలె పట్టి చందాలు ఆర్జించారు. అనాథ వృద్ధులను చేరదీసి వారి ఆలనా పాలనా చూస్తున్న వారికి బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు గవ్వల శివశంకర్, కేఎల్‌ఎన్ ప్రసాద్, ఈడిగ శ్రీధర్, చంద్ర, లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలి



ఉరవకొండ ఆర్టీసీ డిపో ఎదుట రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

**ఉరవకొండ:** పాల్తూరు, హోన్నూరు, బెల్లనగుడ్డం తదితర గ్రామాలకు బస్సులు నడపాలంటూ గ్రామీణ విద్యార్థులు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్, ఇంటర్, టెన్త్ చదువుతున్న గ్రామీణ విద్యార్థులు సకాలంలో బస్సులు లేకపోడంతో విద్యా సంస్థలకు చేరుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము ప్రమాదకర పరిస్థితుల్లో ఆటోల్లోనే ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. కళాశాలలు, పాఠశాలల సమయానికి అనుగుణంగా బస్సులు నడిపాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో కారణంగా ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. బస్సులు నడిపేలా అధికారులతో చర్చిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు.

# ఐక్య ఉద్యమాలతో చేనేత పరిరక్షణ

- చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు



మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు

**అనంతపురం అర్బన్:** ఐక్య ఉద్యమాలతోనే చేనేత రంగం పరిరక్షణ సాధ్యమవుతుందని, ఈ మేరకు ఉద్యమ కార్యచరణను రూపొందిస్తున్నట్లు చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, గోవిందు తెలిపారు. శుక్రవారం అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో చేనేతలకు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన తర్వాత కూటమి పెద్దలు తుంగలో తొక్కారని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి చేనేత రంగం నిర్వీర్యమవుతోందన్నారు. నేతన్నలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకునే దుస్థితిని కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటికీ ఎటువంటి భరోసా ఇవ్వలేదన్నారు. మంత్రుల సొంత ఇలాకాలోనే ఈ ఘటనలు చోటు చేసుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని రక్షించుకునే లక్ష్యంగా ఉద్యమాలు సాగిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 24, 25 తేదీల్లో అధ్యయన యాత్ర చేపట్టి, ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ధర్మవరం పట్టణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని, నేతన్న నేస్తం కింద రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని తక్షణమే అమలు చేయాలని, నేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, చేనేత పెన్షన్, చేనేత బ్యాంక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మధు, పురుషోత్తం, రాధాకృష్ణ, రామ్మోహన్‌నాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

### రిమాండ్‌కు మందుబాబులు

**అనంతపురం సెంట్రల్:** నడిరోడ్డుపై న్యూసెన్స్ చేసిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్‌యాదవ్ శుక్రవారం వెల్లడించారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఓబుళదేవనగర్‌కు చెందిన తిరుమల రాఘవేంద్ర అలియాస్ బిల్లా, సెవన్‌హిల్స్ కాలనీకి చెందిన కదిరి అరుణ్‌కుమార్ గురువారం రాత్రి మద్యం మత్తులో వాహన రాకపోకలకు అంతరాయం కలిగించారు. దీంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని, శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

# వీడిన మిస్సింగ్ మిస్టరీ



సాక్షి ఎఫెక్ట్..

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

**రాప్తాడు రూరల్:** అనంతపురం రూరల్ మండలం కొడిమి దర్గా కొట్టాలకు చెందిన బాలుడి మిస్సింగ్ మిస్టరీ వీడింది. ఈ నెల 12న అదృశ్యమైన బాలుడి ఆచూకీ ఆరు రోజులైనా లభ్యం కాకపోవడంపై ‘వీడని మిస్సింగ్ మిస్టరీ’ శీర్షికన ‘సాక్షి’లో శుక్రవారం వెలువడిన కథనంపై పోలీసులు స్పందించారు. వివరాలను అనంతపురం రూరల్ సీఐ శేఖర్ వెల్లడించారు. ఈ నెల 11న సాయంత్రం 5 గంటల సమయంలో బాలుడు అదృశ్యమయ్యాడు. 12న కేసు నమోదు చేశామన్నారు. వజ్రకరూరు మండలం కమలపాడులో రామాంజనేయులు అనే వ్యక్తి ఇంటి వద్ద ఉన్నాడనే సమాచారంతో పోలీసులు అక్కడకెళ్లి బాలుడిని గుర్తించి ఆధీనంలోకి తీసుకున్నారు. శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు.

### ముగిసిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

**అనంతపురం సిటీ:** స్థానిక సైన్స్ సెంటర్‌లో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ శుక్రవారం ముగిసింది. మొత్తం 32 మండలాల నుంచి 46 మంది విద్యార్థులు హాజరు కాగా, తాడిపత్రి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని హాజియా తబ్సూమ్ ప్రథమ స్థానం, గుంతకల్లు రైల్వే హైస్కూల్ విద్యార్థి ఉదిత్ రెండో స్థానంలో నిలిచారు. వీరిని విజయవాడలో శనివారం జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ, ఎస్‌జీసీ రీజనల్ కో–ఆర్డినేటర్ ఆనంద భాస్కర్‌రెడ్డి తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా ఆర్ట్స్ కాలేజ్ అధ్యాపకుడు డా.కిశోర్, డా.చంద్రశేఖర్ వ్యవహరించారు.

## క్లుప్తంగా

### నేడు 'డొక్కా సీతమ్మ' నాటక ప్రదర్శన

**అనంతపురం కల్చరల్:** ఆరభి యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు బాల బాలికలచే 'డొక్కా సీతమ్మ' సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు ఆముదాల సుబ్రమణ్యం, హైమావతి ఓ ప్రకటనలో తెలిపారు. అపర అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మ స్ఫూర్తిదాయక జీవితాన్ని నాటకంగా మలచి 25 మంది బాలబాలికలతో ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక లలితకళాపరిషత్తు వేదికగా సాగే నాటక ప్రదర్శనను తిలకించాలని ప్రజలను కోరారు.

### మండలస్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం



టాస్ వేసి పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ నరసింహారెడ్డి

**ఆత్మకూరు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం 69వ స్కూల్ గేమ్స్‌ను ఎంఈఓ నరసింహారెడ్డి ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు రామాంజనేయులు, జగదీశ్, నంద, గోవర్దన్, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన శిక్షణ

**అనంతపురం:** సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ విద్యార్థులకు రెండు రోజుల పాటు నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ శుక్రవారం ముగిసింది. వైస్ చాన్సలర్ ఎస్ఏ కోరి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. షీలారెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. 26 ఏళ్ల ఇండస్ట్రీ అనుభవం ఉన్న డేవిడ్ శామ్యూల్ రెజ్యూమ్ నిర్వహణ, ఇంటర్వ్యూ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. మాక్ ఇంటర్వ్యూలు, లైవ్ ఫీడ్ బ్యాక్ సెషన్లు నిర్వహించారు.

### వ్యక్తి అదృశ్యం



కోట్ల ప్రసాద్

**అనంతపురం సెంట్రల్:** నగరంలోని అరవిందనగర్‌కు చెందిన కోట్ల ప్రసాద్ ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ కలహాల కారణంగా 52 ఏళ్ల కోట్ల ప్రసాద్ ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సీఐ శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు 9440796806 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

### నూతన కానిస్టేబుళ్లకు అభినందన



ఉద్యోగాలు సాధించిన వారిని అభినందిస్తున్న రిజిస్ట్రార్ రమేష్ బాబు

**అనంతపురం :** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలలో పీజీ (రూరల్ డెవలప్‌మెంట్) చదువుతున్న విద్యార్థులు ఐదుగురు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తిరుపాలయ్య, చంద్రమౌళి, రాజకుమార్, శివప్రసాద్, సతీష్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. వీరిని శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్ బాబు , రూరల్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ మునినారాయణప్ప, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫిరోజ్ బాబు, టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అకడమిక్ అసిస్టెంట్లు తిరుపాల్, రామలింగయ్య, పరిశోధక విద్యార్థి విజయ్‌కుమార్ రెడ్డి అభినందించారు.

### ఆడపిల్లలపై వివక్ష తగదు



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

**అనంతపురం కార్పొరేషన్:** ఆడపిల్ల పట్ల వివక్ష చూరాదని డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పురుషులకు దీటుగా మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంహెచ్ఓ జెండా ఊపి ప్రారంభించారు. ఆడపిల్లల విద్య, ఆరోగ్యం, భద్రత, సమానత్వం వంటి హక్కులపై అవగాహన ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నారాయణ స్వామి, డాక్టర్ జయలక్ష్మి, డెమో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



సప్తగిరి సర్కిల్‌లో గుంతలమయమైన రోడ్డుపై భయం భయంగా వెళ్తున్న వాహనదారులు

## ప్రధాన మార్గం.. రోడ్డు అధ్వానం

అనంతపురం సప్తగిరి సర్కిల్ నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అలాంటి ప్రాంతంలోనే రోడ్డు చాలా అధ్వానంగా మారింది. ఇటీవల సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఈ రోడ్డుకు ప్యాచ్ వర్కు చేశారు. అయితే..అప్పుడే యథాతథ స్థితికి చేరుకుంది. పైగా ఇటీవల కురిసిన వర్షాలకు మునుపటి కంటే దారుణంగా తయారైంది. వాహనదారులు ఏమాత్రం బ్యాలెన్స్ తప్పినా.. గాయాల పాలవ్వాల్సిందే. కూటమి పాలనలో రోడ్ల దుస్థితికి ఇది అద్దం పడుతోందని నగర వాసులు అంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

# ప్రచారం వారిది.. ఆదాయం వీరిది

- విచ్చలవిడిగా ఫ్లెక్సీలు, హోర్డింగుల ఏర్పాటు
- అధికార పార్టీ నేతల జోక్యంతో అధికారుల మౌనం
- నగరపాలక సంస్థ ఆదాయానికి రూ.లక్షల్లో గండి
- కూటమి నేతల జేబుల్లోకి సొమ్ము



నడిమివంకలో అడ్డంగా కట్టిన ఫ్లెక్సీలు

**అనంతపురం క్రైం:** అధికార పార్టీ నేతల మితిమీరిన జోక్యం నగరపాలక సంస్థ ఆదాయానికి గండి కొడుతోంది. సంస్థకు ఎటువంటి రుసుము చెల్లించకుండానే ప్రైవేట్ వ్యక్తులకు ఉచిత సేవలు అందేలా హుకుం జారీ చేస్తున్నారు. సదరు వ్యక్తుల నుంచి తమ జేబులు మాత్రం నింపుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నగర నలుమూలలా ప్రధాన కూడళ్లు, జనసమ్మర్దన ప్రాంతాల్లో భారీ ఫ్లెక్సీలు, హోర్డింగులు కనిపిస్తున్నాయి. సాధారణంగా వ్యాపార ప్రకటనలకు సంబంధించి ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేయాలంటే నగరపాలక సంస్థకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇలా హోర్డింగులు వంటివి ఏర్పాటు చేసేందుకు అనుమతి ఉన్న వారు పది మంది దాకా ఉన్నారు. అయితే అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న వారు వందల సంఖ్యలో ఉంటున్నారు. షాపింగ్ మాల్స్, జ్యువెలరీ షాపులు, వాహనాల షోరూంలు, ఎగ్జిబిషన్స్, పుస్తక ప్రదర్శనలు తదితర హోర్డింగులు ఎక్కడ చూసినా వెలుస్తున్నాయి. అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకుని, వారికి కొంత నగదు ముట్టచెప్పి.. నగరపాలక సంస్థ అధికారుల నుంచి ఒత్తిడి లేకుండా వాణిజ్య ప్రచారం చేసుకుంటున్నారు. ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారాలు చేసుకునే వారి నుంచి సుంకం వసూలు చేసే అధికారులు నగరంలో అనధికారికంగా సాగుతున్న ప్రచార హోర్డింగుల యజమానుల నుంచి ఎటువంటి రుసుమూ వసూలు చేయడం లేదు. ఇది వరకు ఒకసారి వాణిజ్య ప్రచార పన్నుకు పూనుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు కమిషనర్ నుంచి చుక్కెదురైంది. ఒకటి రెండు రోజులు ప్రచారం చేసుకోనివ్వండి.. ఏమీ కాదు అని చెప్పారట. అంతే అప్పటి నుంచి నోటిమాటగా చెప్పిన ఆ గడువు దాటిపోయి నెలలు గడిచినా దాని గురించి పట్టించుకోవడం లేదు. దీంతో సంస్థ లక్షలాది రూపాయల ఆదాయం కోల్పోతోంది. అధికార పార్టీ నాయకుల స్వార్థం.. అధికారుల ఉదాసీనత వెరసి సంస్థ ఆదాయానికి బీటలు పడేలా చేస్తోంది.

**కార్పొరేషన్‌కు కాదు.. 'కూటమి'కి ట్యాక్స్!**

అన ధికారిక హోర్డింగులు, బ్యానర్లు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు నామమాత్రపు అనుమతి కోరుతూ నగర పాలక సంస్థలో ఇచ్చిన లేఖలు సైతం చెత్త బుట్టలో వేస్తున్నారు. వ్యాపారుల నుంచి అందిన కాడికి దోచుకుని వాటాలేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కాగా కమిషనర్ స్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది దాకా ఎవరి పరిధిలో వారికి చేరాల్సిన మొత్తం చేరిపోతోంది. తాజాగా పాలక వర్గాన్ని కాదని అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు నగర పాలక సంస్థలో పాగా వేశారు. అధికారికంగా నగరపాలక సంస్థకు మీటరుకు రూ.800 చొప్పున పన్ను కట్టి హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. అలాంటి వారిని కూడా అధికారపార్టీ నేతలు వదల్లేదు. వారి నుంచి బలవంతంగా రూ.లక్షల వసూళ్లకు తెగబడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. బహిరంగ వసూళ్ల పర్వం చూసి నగర వాసులు, చిరు వ్యాపారులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు.

**చట్టం ఏం చెబుతోందంటే..**

ఏపీ మున్సిపాలిటీ చట్టం–1965 సెక్షన్ 326–330 ప్రకారం అనుమతి లేకుండా ఏర్పాటు చేసుకునే ఫ్లెక్సీ కానీ, హోర్డింగ్‌ను కానీ నేరంగా పరిగణించాలి. వాటిని తక్షణం తొలగించి రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధించాలి. అప్పటికీ దారికి రాని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి అన్ని అధికారాలూ ఉన్నాయి. ఈ నిబంధనలను అధికారులు ఎప్పుడో మరిచిపోయారు. 2022లో ప్రభుత్వం జారీ చేసిన ఔట్‌డోర్ అడ్వర్టైజ్‌మెంట్ మార్గదర్శకాల ప్రకారం రోడ్ల అంచుల్లో, స్కూలు, హాస్పిటల్స్ ఎదుట హోర్డింగ్స్ నిషేధం. పబ్లిక్ ప్రాపర్టీలో కూడా ఫ్లెక్సీలు, హోర్డింగులు వంటివి వేయకూడదు. ఈ మార్గదర్శకాలు నగర పాలక సంస్థ అధికారులు ఏనాడూ పాటించిన దాఖలాలు లేవు.

# అప్పుల ఊబిలోకి రాష్ట్రం

**అనంతపురం అర్బన్:** కూటమి ప్రభుత్వం తన ఏడాదిన్నర పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు మండిపడ్డారు. డిసెంబర్ ఆరు, ఏడు తేదీల్లో అనంతపురంలో పార్టీ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నారు. మహాసభల కరపత్రాలను నాయకులు శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి వేమన, గౌరవాధ్యక్షుడు వలి మాట్లాడుతూ సంపద సృష్టిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ఆమడదూరంలో రాష్ట్రాన్ని నిలబెట్టిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు భూములను, రాష్ట్ర సంపదను ధారాదత్తం చేసే పనిలో పడిందని విమర్శించారు. కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ మతతత్వ, మనువాద విధానాలను అమలు చేస్తోందన్నారు. ఇది దేశానికి పెనుప్రమాదం తెచ్చిపెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం ప్రైవేటీకరణ చేస్తుంటే అడ్డుకోలేని నిస్సహాయ స్థితిలో కూటమి ప్రభుత్వం ఉండడం రాష్ట్రానికి శాపమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు పరశురాముడు, వినోద్, సుజాతమ్మ, భీమేష్, ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

### యువ గర్జన మహాసభ జయప్రదం చేయండి

**అనంతపురం టవర్‌క్లాక్:** నగరంలోని లలితకళా పరిషత్‌లో ఈ నెల 31న నిర్వహించే విద్యార్థి యువ గర్జన మహాసభను జయప్రదం చేయాలని ఓసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి బుర్రా జయవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. బుర్రా జయవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఓసీలలో కూడా అత్యంత పేదరికంలో ఉన్నారని, అన్ని రంగాలలో అణచివేతకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఓసీలను ఆదుకోవాలనే ప్రధాన డిమాండ్‌తో విద్యార్థి యువ గర్జన మహాసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### చదువుతోనే ఉజ్వల భవిత

**రాప్తాడు:** చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని, అందువల్ల ఎన్ని కష్టాలు ఎదురైనా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాప్తాడు పీహెచ్‌సీ సీహెచ్ఓ శివ ప్రసాద్ బాలికలకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో బాలికలతో సమావేశం నిర్వహించారు.

### ట్యాంకుల శుభ్రత పట్టదా?



డ్రెయినేజీపై ఏర్పాటు చేసిన ట్యాంకు వద్ద అపరిశుభ్రత

**అనంతపురం రూరల్:** ఎ.నారాయణపురం పంచాయతీలో తాగునీటి ట్యాంకుల శుభ్రతను అధికారులు మరిచారు. తపోవనం నుంచి ఎ.నారాయణపురం వెళ్లే దారిలోనున్న ట్యాంకుకు సరఫరా అయ్యే నీటిలో మురుగు కలుస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. తపోవనం శివాలయం ఎదురుగా డ్రెయినేజీపై తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

# పాలన చేతగాకే అక్రమ కేసులు



రాప్తాడులో నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు



రాప్తాడులో తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు, నాయకులు

- పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు
- రాప్తాడులో జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు నిరసన

**రాప్తాడు:** ప్రజల గొంతుకగా నిలుస్తున్న సాక్షి మీడియాపై చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగిందని, పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ కుట్రలకు పదును పెడుతోందని జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యంపై వార్తలు ప్రచురించిన 'సాక్షి' మీడియాపై కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ శుక్రవారం రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టుల ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'మీడియాపై కేసులా సిగ్గు, సిగ్గు' 'రెడ్ బుక్ పాలన మాకొద్దు', 'చంద్రబాబు నిరంకుశ పాలన నశించాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ...నిజాలను నిర్భయంగా రాస్తున్న పాత్రికేయులపై కూటమి సర్కార్ కక్ష గట్టి, అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. పత్రికా కార్యాలయాల్లో సోదాలు, సంపాదకుల ఇళ్లలో తనిఖీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రతికా స్వేచ్ఛను హరిస్తోందన్నారు. అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. అక్రమ కేసులు, పదే పదే నోటీసుల జారీతో జర్నలిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. 16 నెలలుగా కూటమి ప్రభుత్వం 'సాక్షి' మీడియాపై తీవ్రమైన దమనకాండను కొనసాగిస్తోందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాత్రికేయుల మద్దతుగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కూడా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్**

రాప్తాడు వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక..పాలన చేతకాని కూటమి సర్కార్ అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తున్న 'సాక్షి' మీడియాపై అక్రమ కేసులు బనాయించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. నకిలీ లిక్కర్, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశాల్లో కూటమి ప్రభుత్వం అడ్డంగా దొరికిపోయిందని, వాటిపై ప్రజలకు సమాధానం చెప్పుకోలేక వార్తలు రాసిన జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. అక్రమ కేసులతో ప్రశ్నించే గొంతుకలను నొక్కలేరన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మహదేవరెడ్డి, కొండారెడ్డి, మురళి మోహన్ రెడ్డి, ఖాశీం వలి, మురళి, అశోక్, ప్రజా సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు సాకే వెంకటేష్, జూటూరు శేఖర్, విశ్వనాథ్ రెడ్డి, చిరుతల నాగేంద్ర, జయన్న, సాకే రవి, చెన్నారెడ్డి, ఆనంద్ రెడ్డి, నల్లప్ప, జూటూరు లక్ష్మన్న, సింగారప్ప, అమర్‌నాథ్, అశ్వర్థప్ప, చంద్రశేఖర్, పోతులయ్య, శ్రీనివాసులు, చంద్రశేఖర్, యల్లప్ప, సంగాలప్ప, శేషాద్రి, శివయ్య, విజయ్‌కుమార్, చంద్రశేఖర్, సురేష్, నాగేంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీకే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

- కూటమి సర్కార్‌పై నిప్పులు చెరిగిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా సంతకాల సేకరణ

**చెన్నేకొత్తపల్లి:** ''నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందించాలి. ఆయా కుటుంబాల్లోని విద్యార్థులకు కలగా మారిన వైద్యవిద్యను చేరువ చేయాలన్న ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన హయాంలో 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారు. అందులో ఐదింటిని పూర్తి చేశారు. ఈలోపు ప్రభుత్వం మారగా... ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు సిద్ధమైంది. ఈక్రమంలోనే 12 మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు సిద్ధమైంది'' అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ శుక్రవారం స్థానిక స్థానిక సీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చెన్నేకొత్తపల్లికి వచ్చిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తొలుత న్యామద్దెల సర్కిల్‌లో ఉన్న దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫంక్షన్‌హాలుకు చేరుకుని మాట్లాడారు. చంద్రబాబు తన హయాంలో ఒక్క మెడికల్ కళాశాల అయినా తీసుకువచ్చారా... అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నత ఆశయంతో తీసుకువచ్చిన మెడికల్ కళాశాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు సిద్ధమయ్యారన్నారు. కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు కూడా సంతకం చేసి సర్కార్ తీరును ఎండగట్టాలన్నారు.

**అది అదానీ డేటా సెంటర్**

చంద్రబాబు తాను విశాఖపట్నంకు గూగుల్ కంపెనీ తెచ్చానని గొప్పలు చెబుతున్నారని, కానీ అది జగన్ హయాంలో చేసుకున్న ఒప్పందం మేరకే విశాఖలో ఏర్పాటవుతోందన్నారు. కాకపోతే అప్పుడు దాన్ని అదాని డేటా సెంటర్ అని పిలిచే వారమన్నారు. ఈ విషయాన్ని సదరు గూగుల్ కంపెనీనే వెల్లడించిందన్నారు. అయినా కూటమి నాయకులు అబద్ధాలు చెబుతూ తామేదో ఉద్ధరిస్తున్నట్లు గొప్పలకు పోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేసింది ఏదైనా ఉందీ అంటే అది నకిలీ మద్యం పారించడమేనన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా క్వాలిటీ మద్యం దొరకడం లేదని సామాజిక మాధ్యమాల్లో జనమే చెబుతున్నారన్నారు. సమావేశంలో సానే రాజారెడ్డి, చెన్నేకొత్తపల్లి ఎంపీపీ మజ్జిగ అంజలి, సర్పంచ్ ధనుశ్రీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

**అనంతపురం :** ఉద్యోగం చేయడం కంటే.. ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు నైపుణ్యాల పెంపుదలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెక్టార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వర్సిటీలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్, రూసా సెంట్రల్ లైబ్రరీని వినియోగించుకోవాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమానికి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గరికపాటి గురజాడ విశిష్ట అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎన్.గీతాంజలి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర , కన్వీనర్ డాక్టర్ జె.లత తదితరులు పాల్గొన్నారు.

### గుంతలు కనిపించడం లేదా?

**అనంతపురం అర్బన్:** కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగుల తీస్తోదంటూ ప్రచారం చేసుకుంటన్న పాలకుల కళ్లకు నగరంలో రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు కనిపించడంలేదా అని సీపీఎం నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం సప్తగిరి సర్కిల్ వద్ద ప్రధాన రోడ్డులో ఏర్పడిన గుంతల్లో సీపీఎం నాయకులు వరినాట్లు వేసి నిరసన తెలిపారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ నగరంలో ఎక్కడ చూసిన రోడ్లలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. సప్తగిరి సర్కిల్ వద్ద చేసిన రోడ్డు ప్యాచ్ వర్క్ నెల రోజుల్లోనే పాడయ్యిందంటే పనుల్లో నాణ్యత లేదనే విషయం స్పష్టమవుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, శీనా, రాజు, గఫూర్, ఎర్రిస్వామి, రామాంజినమ్మ, ఇస్మాయిల్, శంకర్, శంషాద్, హాజీవలి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



గుంతల్లో మట్టి నింపి వరినాట్లు వేస్తున్న నాయకులు

### నేత్రపర్వంగా రమా ఏకాదశి వేడుకలు



నిజరూపదర్శనం చేసుకుంటున్న భక్తులు

**అనంతపురం కల్చరల్:** నగరంలోని రామనగర్‌లోని శ్రీరుక్మిణి విఠల పాండురంగస్వామి ఆలయంలో శుక్రవారం రమా ఏకాదశి వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. భావసార క్షత్రియ సమాజ్ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నిజరూపదర్శనంలోని రుక్మిణీ పాండురంగడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకృష్ణ నామస్మరణతో ఆలయం మార్మోగింది. మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాల వితరణ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు తిరుపతిరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు ధన త్రయోదశి వేడుకలు

**అనంతపురం కల్చరల్:** దీపావళి పర్వదినాల ముందొచ్చే ధన త్రయోదశి వేడుకలు నగరంలోని హెచ్చెల్సీ కాలనీ శ్రీఅన్నపూర్ణ మంజునాథస్వామి దేవస్థానంలో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మఠం బసవరాజస్వామి తెలిపారు. ఆదివారం ఉదయం శ్రీలక్ష్మీ కుబేర సమేత శ్రీఅనంత ఐశ్వర్యేశ్వరస్వామికి విశేష పంచామృత సేవలు, శ్రీచక్ర స్వర్ణలింగానికి భక్తుల ద్వారానే రుద్రాభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు.

### శుభకార్యం

**రాప్తాడు:** స్థానిక లక్ష్మీ పండమేటి రాయుడు ఆలయంలో జరిగిన జ్ఞానకేశ్వరి, పవన్ కుమార్ వివాహం శుక్రవారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

### కేఎస్ఆర్‌లో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

**అనంతపురం సిటీ:** నగరంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన ఆర్ఓ ప్లాంట్‌ను పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రారంభించారు. 1,500 మంది చదివే పాఠశాలలో తాగునీటికి ఇబ్బందులు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు, ఎంఈఓ లక్ష్మీదేవి, హెడ్మాస్టర్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### 'కృత్రిమ మేధ 'తో విప్లవాత్మక మార్పులు

**అనంతపురం:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)తో ఇంజినీరింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నట్లు ఐబీఎం టీం లీడ్ వినయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థులకు కోడింగ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కోడింగ్ ద్వారా మొబైల్ యాప్‌లు, వెబ్‌సైట్లు, గేమ్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి టెక్నాలజీని అభివృద్ధి చేయవచ్చునని వివరించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సురేంద్రనాయుడు , ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ వీఎస్ కీర్తన, ఉదయ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**రాప్తాడు:** వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చని అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశులు సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం రాప్తాడులోని లారీ అసోసియేషన్ కార్యాలయంలో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

### నేడు విశ్రాంత ప్రిన్సిపాల్ అంత్యక్రియలు



శ్రీకంఠం రామచంద్ర(ఫైల్)

**అనంతపురం సిటీ:** ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ శ్రీకంఠం రామచంద్ర అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన పేరూరులోని వ్యవసాయ క్షేత్రంలో శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీకంఠం రామచంద్ర ఆర్ట్స్ కళాశాలలో విద్యనభ్యసించి అక్కడే అధ్యాపకుడిగా జీవితాన్ని ప్రారంభించారు. అక్కడే ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. 2000 జూన్‌లో రిటైర్డ్ అయ్యారు. ఆయనకు భార్య విమలాదేవి, కుమార్తెలు మృదుల, మాధవి, కుమారుడు సుబ్బరామప్రసాద్ ఉన్నారు. రామచంద్ర తండ్రి శ్రీకంఠం సుబ్బయ్య పేరుతో అనంతపురంలోని శ్రీకంఠం సర్కిల్ గుర్తింపు పొందడం విశేషం. రామచంద్ర మృతికి ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సీవీ రమణ, శ్రీనివాసులు, సీనియర్ అధ్యాపకులు భాను ప్రసాద్, సుబ్బన్న, వన్నూరప్ప ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

### నకిలీ సర్టిఫికెట్లపై విచారణకు వినతి

**అనంతపురం :** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన స్పోర్ట్స్‌కు సంబంధించి జారీ చేసిన సర్టిఫికెట్లలో నకిలీవి ఉన్నట్లు తెలిసిందని ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. అన్ని స్పోర్ట్స్ సర్టిఫికెట్లపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఫ్యాకల్టీతో సర్టిఫికెట్లు ఇవ్వకుండా.. గెస్ట్ ఫ్యాకల్టీతో జారీ చేశారని, ఇందులో ధర్మవరానికి చెందిన పీడీ పాత్ర ఉన్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ వర్సిటీ కార్యదర్శి రమణయ్య, నాయకులు సాయి మహేష్, జగదీష్, శీనునాయక్, మహేష్ బాబు పాల్గొన్నారు.